## క్లుప్తంగా

### జిల్లా సివిల్ సప్లై విజిలెన్స్ సభ్యుడిగా విజయ్‌కుమార్

**అంబర్‌పేట:** జిల్లా సివిల్ సప్లై విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా అంబర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ నియమితుల య్యారు. ఈ మేరకు ఆయన సోమవారం చీఫ్ రేషనింగ్ అధికారి బాలమయాదేవి ఆధ్వర్యం లో జరిగిన సమీక్షా సమావేశానికి హాజర య్యారు. లబ్ధిదారులకు రేషన్ పంపిణీ తదితర అంశాలపై ఆమె ఆరా తీశారు. రేషన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సభ్యులు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. పలువురు సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

### అభినందన



**కాచిగూడ:** క్రీడా రంగానికి అధిక నిధులు కేటాయించి క్రీడాకారులను ప్రోత్సహించాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జావేద్ కోరారు. తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్‌ను సోమవారం డీవైఎఫ్‌ఐ ప్రతినిధులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్–2023 లో క్రీడా రంగానికి అధిక నిధులు కేటాయించి గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. అనంతరం డీవైఎఫ్‌ఐ హైదరాబాద్ జిల్లా కేలండర్‌ను ఆవిష్కరించారు. ఎస్‌ఎఫ్‌ఐ నేతలు శ్రీమాన్, వేణు తదితరులున్నారు.

### జలమండలి నూతన డీజీఎంగా మోహన్‌రాజ్



**ముషీరాబాద్:** నారాయణగూడ డివిజన్–5 పరిధిలోని చిలకలగూడ జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా మోహన్‌రాజ్ విధుల్లో చేరారు. ఇప్పటి వరకు డీజీఎంగా పనిచేసిన దిలీప్‌కుమార్ బదిలీపై వెళ్లారు. గత రెండు నెలల కాలంలో ముగ్గురు డీజీఎంలు మారటం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ముషీరాబాద్ సెక్షన్ మేనేజర్‌గా పని చేస్తున్న నవీన్ ఆజామాబాద్, అడిక్‌మెట్ డివిజన్‌లకు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు.

### సినీ నటి జమున సంతాప సభ

**చిక్కడపల్లి:** నటీమణులకు గౌరవం తెచ్చిన గొప్పనటి జమున అని పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో సోమవారం ఇటీవల మృతి చెందిన సినీ నటి జమున సంతాపసభ జరిగింది. దీనికి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆమె నటనలో హుందాతనం. సంప్రదాయ కట్టుబొట్టుతో గొప్పగా కనిపించేవారన్నారు. తెలుగు చిత్రసీమలో సావిత్రి, జమున, ఎన్టీఆర్, ఏఎన్ఆర్ కాలం స్వర్ణయుగమన్నారు. గాయకుడు త్రినాథరావు, గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి, బండి శ్రీనివాస్‌వందన, ఉష తదితరులు పాల్గొన్నారు.

### ఎదురీత బాలల కథలు ఆవిష్కరణ



**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** బాల్యం ఓ ఎదురీతగా మారిపోయిందని సుప్రసిద్ధ కథా, నవలా రచయిత చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందాచారి అధ్యక్షతన జరిగిన సభలో ఎదురీత బాలల కథా సంకలనాన్ని ఆయన ఆవిష్కరించారు. పిల్లల కథలంటే పెద్దలకు సంబంధం లేదనే భావన సరికాదన్నారు. చొక్కాపు వెంకటరమణ, ప్రముఖ బాల సాహితీవేత్త వీఆర్ శర్మ, బాలల హక్కుల కార్యకర్త శ్యామల, తెలంగాణ సాహితి రాష్ట్ర నాయకులు చక్రవర్తి, మోహన్‌కృష్ణ, హైదరాబాద్ నగర కమిటీ నాయకుడు శరత్‌సుదర్శి, రేఖ, రామకృష్ణ, చంద్రమౌళి, ముజాహుద్దీన్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఇన్‌చార్జ్ బుచ్చిరెడ్డి తదితరులున్నారు.

### అలరించిన సంగీత విభావరి

**చిక్కడపల్లి:** నటి జమునకు నివాళిగా ప్రముఖ గాయకులు రామోజీ, కనకరత్నం సినీ నటి జమున నటించిన చిత్రాల్లో పాడిన పాటలు అలరించాయి. సోమవారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు పాటలు, హిందీ పాటలతో లతామంగేష్కర్‌కు నివాళిగా గాయకులు పాటలు పాడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. గాయకులు లక్ష్మీ, శైలజ, అపర్ణ, వాణిశ్రీ, చక్రపాణి, వెంకటరావు, రమేష్, వేణుగోపాల్‌లు పాల్గొనగా.. ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత్రి శశిబాల, సంఖ్యాశాస్త్రజ్ఞులు దైవజ్ఞశర్మలు పాల్గొని గాయకులను సత్కరించారు.

# నిర్లక్ష్యం



మోతీమార్కెట్‌లో రోడ్డుపై ఉన్న మట్టికుప్పలను చూపిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

**కాచిగూడ:** మోతీమార్కెట్‌లో నూతనంగా సీసీ రోడ్డు వేసిన సందర్భంగా పేరుకుపోయిన మట్టి కుప్పలను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దీంతో స్థానిక ప్రజలు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అన్నారు. సోమవారం మోతీమార్కెట్ ప్రాంతంలో కార్పొరేటర్ పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ.. నెల రోజుల క్రితం వేసిన రోడ్డు కారణంగా ఏర్పడిన మట్టి కుప్పలను వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. బీజేపీ నేతలు సంతోష్, భీమ్‌రాజ్, సూరి, ఎల్.సత్యనారాయణ, లక్ష్మమ్మ, రాము, రవియాదవ్, దినేష్ తదితరులున్నారు.

# పర్యటన

**అంబర్‌పేట:** స్వచ్ఛ హైదరాబాద్‌కు ప్రజలు సహకరించాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి కోరారు. సోమవారం డివిజన్‌లలో పారిశుద్ధ్య సమస్యలపై ప్రజలు చేసిన ఫిర్యాదు మేరకు ఆమె డివిజన్‌లోని భరత్‌నగర్, పోచమ్మ బస్తీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోలు సరిగ్గా రావడం లేదని ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. మౌలిక సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ స్వచ్ఛ ఆటోల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ నేతలు అజయ్‌కుమార్, మిర్యాల శ్రీనివాస్ భాస్కర్, సుధాకర్ తదితరులున్నారు.



కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

# ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ విజయ్‌కుమార్

**అంబర్‌పేట:** నియోజకవర్గంలో రోడ్ల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం అంబర్‌పేట్ డివిజన్ అహ్మద్‌నగర్‌లో రూ.17 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే కోట్లాది రూపాయలు వెచ్చించి నియోజకవర్గంలో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా చొరవ తీసుకుంటున్నానన్నారు. అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు సిద్ధార్థ ముదిరాజ్, ఆంజనేయులు, జాఫర్, మహేష్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పర్యటన

**ముషీరాబాద్:** ముషీరాబాద్ నియోజకవర్గంలో డ్రైనేజీ, తాగునీటి కాలుష్యం, రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయకూడదని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. సోమవారం ముషీరాబాద్, అడిక్‌మెట్ డివిజన్‌లను పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు.

- ముషీరాబాద్ డివిజన్‌లోని అరుణ కో– ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ కాలనీలో సుమారు రూ. 4 లక్షలతో చేపట్టే డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు.
- భరత్‌నగర్‌లోని రేడియంట్ హైస్కూల్ లైన్‌లో డ్రైనేజీ, నీటి సరఫరాలో సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించడంతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతన పైపులైన్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.
- కుమ్మరి సంఘం ప్రాంతంలో పాత పైపులైన్ మూలంగా డ్రైనేజీ నిత్యం పొంగుతూ ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని స్థానికులు చెప్పడంతో నూతన డ్రైనేజీ పైపులైన్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.
- ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో రోడ్లు, తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు చెప్పడంతో జీహెచ్‌ఎంసీ డీఈ గీతాకుమారిని పిలిపించి జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో పనిచేసి వెంటనే రోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.
- అడిక్‌మెట్ డివిజన్ లక్ష్మమ్మ పార్కును సందర్శించి సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యను పరిష్కరిస్తానన్నారు.
- వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా లైన్‌లో డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. ఈ సమస్య పరిష్కారానికి కూడా ప్రతిపాదనలు రూపొందించి కొత్త పైపులైన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. జీహెచ్‌ఎంసీ డీఈ గీతాకుమారి, జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, మేనేజర్ నవీన్, బీఆర్‌ఎస్ నాయకులు సోమసుందర్, సయ్యద్ అహ్మద్ బక్తియార్, అరుణ్‌కుమార్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, రవియాదవ్, శోభా, మేరీ, లక్ష్మణ్‌గౌడ్, బీజేపీ అసెంబ్లీ కో–కన్వీనర్ నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు బద్రీనారాయణ, అనిల్‌కుమార్, సత్యనారాయణ తదితరులున్నారు.



ముషీరాబాద్ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, అధికారులు

# టీఎన్‌జీవోస్ కేలండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

**కాచిగూడ:** భాగ్యనగర్ టీఎన్జీఓస్ (గచ్చిబౌలి) మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 కేలండర్‌ను సోమవారం ఎక్సైజ్, క్రీడా, పర్యాటక మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. టీజీఓ అధ్యక్షురాలు మమత, టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ళ రాజేందర్, ప్రధానకార్యదర్శి ప్రతాప్, అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణగౌడ్, ఎం.బీ.కృష్ణయాదవ్, హౌసింగ్ సొసైటీ కార్యదర్శి మల్లారెడ్డి, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, చందు, సుశీల్‌కుమార్, శ్రీనివాస్‌రావు, సొసైటీ డైరెక్టర్లు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**వ్యవసాయ విజ్ఞాన సదస్సు పోస్టర్ ఆవిష్కరణ**

**కవాడిగూడ:** గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి సమగ్ర వ్యవసాయ విజ్ఞాన సదస్సు వాల్‌పోస్టర్‌ను మంత్రి నిరంజన్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఫిబ్రవరి 14న ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసే సదస్సులో రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న సుద్దాల అశోక్ తేజ

**అంబర్‌పేట:** తెలంగాణ బాలోత్సవం జిల్లా స్థాయి సాంస్కృతిక ప్రదర్శన పోటీల్లో అంబర్‌పేట డ్రీమ్స్ కిడ్స్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇటీవల జరిగిన పోటీల్లో గ్రూప్ డ్యాన్స్ విభాగంలో ద్వితీయ స్థానం, కథల్లో రితిక ద్వితీయ స్థానం, జానపద గీతాలాపనలో 7వ తరగతి విద్యార్థి అఖిల్ తృతీయ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ సోమవారం ప్రకటించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ అభినందించారు. భవిష్యత్తులో తమ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తోడ్పాటును అందిస్తామన్నారు.

### సేవా సంస్థల కృషి అభినందనీయం



**చిక్కడపల్లి:** ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించే సేవా సంస్థల కృషి అభినందనీయమని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఆర్‌ఎన్‌సీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ నేత వినయ్‌కుమార్, డాక్టర్ హిప్నాపద్మాకమలాకర్, శ్రీనివాస్, రమాదేవిరెడ్డి, రఘు, లక్ష్మి, నిరీక్ష, మంగళ, విజయలక్ష్మి తదితరులున్నారు.

# తెలంగాణ, తమిళ భవన్ ఏర్పాటు చేయాలి




తెలంగాణ తమిళ సంఘం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న పలువురు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** తెలంగాణ రాష్ట్ర రాజధాని నగరంలో తమిళులకు ప్రత్యేక తమిళ భవన్ నిర్మించాలని తెలంగాణ తమిళ సంఘం అధ్యక్షుడు ఎం.కే.బోస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ తమిళ సంఘం ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో తమిళులు సుమారు 9 లక్షలకు పైగా జనాభా ఉన్నారని ఈ విషయంపై గతంలో మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ప్రత్యేక స్థలం కేటాయింపు జరగలేదని మలయాళీల మాదిరిగానే తమిళులకు కూడా ప్రత్యేక స్థలం, భవన నిర్మాణం ఏర్పాటు చేయాలన్నారు. ఆటలు, వివిధ రకాల పోటీలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యక్షులు ధర్మసీలన్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, కోశాధికారి నేరుశాస్త్రీ, కోశాధికారి కుమారరాజన్ తదితరులున్నారు.

# ప్రతిభా అవార్డు గ్రహీతలకు అభినందన



**సికింద్రాబాద్:** రైల్వే, రక్షణదళం సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన పలువురు అధికారులు, ఉద్యోగులు సమర్థవంతమైన విధులు నిర్వహించి ఉన్నతాధికారుల నుంచి అవార్డులు అందుకున్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డులు అందుకున్న అధికారులు, ఉద్యోగులను సోమవారం తన కార్యాలయంలో ఆర్‌పీఎఫ్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ దెబష్మిత బెనర్జీ అభినందించారు. రైల్వే ఆస్తుల పరిరక్షణ, సుదీర్ఘకాలంగా సమర్థవంతమైన సేవలు అందించడం వంటి వివిధ విభాగాల్లో మెరిటోరియల్ అవార్డులను సికింద్రాబాద్ డివిజన్ అధికారులు అందుకున్నారు. అంకితభావంతో సుదీర్ఘకాలం సేవలు అందించిన విభాగంలో ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవిబాబు, ఏఎస్‌ఐ ఆర్.శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ యు.సీమ అవార్డులు అందుకున్నారు. ప్రమాదకర పరిస్థితుల నుంచి ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన విభాగం నుంచి ఏఎస్‌ఐ కోటేశ్వర్‌రావు, కానిస్టేబుళ్లు పి.రమేష్, దినేష్‌సింగ్, నీల్‌కమల్, గిరిరాజ్, ప్రసాద్‌కు ప్రతిభా అవార్డులు లభించాయి. దొంగిలించిన వస్తువులు రికవరీ చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్‌పీఎఫ్ మహిళా ఎస్‌ఐలు వి.ప్రజ్ఞ, శ్రావణిరెడ్డి అవార్డులు అందుకున్నారు.

### బీఆర్‌ఎస్‌కు విశేష స్పందన

**ముషీరాబాద్:** భారతదేశంలో ఏ రాష్ట్రంలో చేపట్టని అభివృద్ధి, సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. ఈ సంక్షేమాన్ని చూసి యువత బీఆర్‌ఎస్ పార్టీకి ఆకర్షితులవుతున్నారన్నారు. బీజేవైఎం కాలేజస్ అండ్ స్టడీ సర్కిల్ నగర ఇన్‌చార్జ్ రమేష్‌యాదవ్ తన అనుచరులతో కలిసి రాంనగర్ డివిజన్ బాకారంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆయన కుమారుడు ముఠా జైసింహల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. రాంనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు మోజెస్, మన్నె దామోదర్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌గౌడ్, శ్రావణ్‌కుమార్, సునీల్, సత్యనారాయణ, టీ.వీ.రాజు, జనార్దన్, శ్యామ్‌సుందర్, మాధవ్ తదితరులున్నారు.

### బడ్జెట్ పై అసెంబ్లీలో చర్చించండి

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ బడ్జెట్ పై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని పీడీఎస్‌యూ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం వివిధ కాలేజీల విద్యార్థులతో జరిగిన సమావేశంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ పీడీఎస్‌యూ నేతలు ఓయూ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి



గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్ ముదిరాజ్

**ముషీరాబాద్:** ముషీరాబాద్ నియోజకవర్గంలో భారత జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముషీరాబాద్ డివిజన్‌లోని గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి గాంధీజీ చేసిన సేవలను కొనియాడారు.

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్‌ముదిరాజ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేతలతో కలిసి నివాళి అర్పించారు.
- ఏఐసీసీ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి శత్రువు ముషీరాబాద్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**చిక్కడపల్లి:** గాంధీనగర్ డివిజన్ కెనరాబ్యాంక్ వద్ద బీఆర్‌ఎస్ యువజననాయకుడు ముఠా జైసింహ మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమవారం డివిజన్ పార్టీ బీసీసెల్ అధ్యక్షుడు గడ్డమీది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జైసింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, ఆకుల శ్రీనివాస్, నరేష్, సత్యనారాయణ, మారిశెట్టి నర్సింగ్‌రావు, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, వెంకటేష్, పాశంరవి, ఇస్తారి విఠల్, గిరి, దేవయ్య, సుధాకర్, హనుమంతు, శ్రీనివాస్, కృష్ణ, కిరణ్‌కుమార్, సత్యనారాయణ, రత్నయ్య, భాస్కర్‌రెడ్డి, గణేష్, చందు, మోహన్, సంజీవ తదితరులున్నారు.



బాపూజీనగర్‌లో ఏఐసీసీ ఫిషర్‌మెన్ సెల్ జాతీయ కార్యదర్శి



గాంధీనగర్ డివిజన్ కెనరాబ్యాంక్ వద్ద..

# విద్యారంగానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలి

**ముషీరాబాద్:** విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్క్స్ భవన్‌లో సమావేశం జరిగింది. సోమవారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం శ్యామ్, కంచనపల్లి శ్రీనులు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 3న జరిగే అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగానికి 9–10 శాతం నిధులు కేటాయిస్తే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో 5–6 శాతం నిధులకు పరిమితమైందన్నారు.
- విద్యా రంగానికి సరిపడా నిధులు కేటాయించకపోవడంతో రూ. 3500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నాయన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించాలన్నారు. జిల్లా నాయకులు గౌతం, రాకేష్, సాయి, గణేష్, మాధవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్యామ్

# భారత్ జోడో ముగింపు సంబరాలు

**అంబర్‌పేట:** దేశ సమగ్రత కోసం దేశంలో పాదయాత్ర చేసిన ఘనత రాహుల్‌గాంధీదేనని కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర బాగ్‌అంబర్‌పేట్ రెడ్‌బిల్డింగ్ వద్ద పార్టీ నాయకులు చేపట్టిన ముగింపు సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెడ్ బిల్డింగ్ చౌరస్తా నుంచి మహంకాళి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టి బీజేపీ, బీఆర్‌ఎస్ వైఫల్యాలను ముద్రించి కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ జోడో యాత్ర స్ఫూర్తితో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతామన్నారు. కాంగ్రెస్ నాయకులు సంపత్‌యాదవ్, ప్రదీప్‌గౌడ్, సద్దాం, సోహెల్, సాయినితీష్‌గౌడ్, శశికాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**చిక్కడపల్లి:** ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడోయాత్ర విజయవంతమైందని, నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్, ముషీరాబాద్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అభిషేక్ కెన్నడీ పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర ముగిసిన సందర్భంగా సోమవారం చిక్కడపల్లిలో వారు మాట్లాడారు. గతేడాది సెప్టెంబర్ 7న కన్యాకుమారి నుంచి ప్రారంభమైన భారత్‌జోడో యాత్ర 132 రోజులు 75 జిల్లాల్లో 4,080 కిలో మీటర్ల మేర విజయవంతంగా పూర్తి చేసి సోమవారం ముగించారన్నారు.



కాంగ్రెస్ ఓబీసీసెల్ రాష్ట్ర అధ్యక్షులు నూతి శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

# డీసీపీని కలిసిన ఉద్యోగ సంఘం ప్రతినిధులు

**ముషీరాబాద్:** మల్కాజిగిరి, మేడ్చల్ జిల్లా డీసీపీగా జానకి పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం కార్యాలయంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పీ.వీ.రమణ నేతృత్వంలో ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించినట్లు రమణ తెలిపారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి హరిరాం, జాతీయ ఉపాధ్యక్షులు సీ.హెచ్.రామచంద్రరావు, శ్రీనివాసులు, సతీష్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



డీసీపీ జానకితో ఉద్యోగ సంఘం ప్రతినిధులు

# బాలసాయిబాబా జయంతి వేడుకలు



కుట్టుమిషన్లు, దుప్పట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

**కవాడిగూడ:** నిరుపేద ప్రజలను ఆదుకునేందుకు బాలసాయిబాబా ట్రస్ట్ అందిస్తున్న సేవలను ప్రభుత్వంతో పాటు ప్రైవేటు స్వచ్ఛంద సంస్థలు ఆదర్శంగా తీసుకుని సేవలు అందించాలని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ అన్నారు. సోమవారం దోమలగూడ గగన్‌మహల్‌లోని ఆశ్రమంలో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ రామారావు ఆధ్వర్యంలో నిరుపేదలకు కుట్టు మిషన్లు, ట్రై సైకిళ్లు, తోపుడు బండ్లు, దుప్పట్లను పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కార్పొరేటర్ సూచించారు. యాదవసేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కిషన్ యాదవ్, లాయర్ ఫోరం అధ్యక్షులు నాగుల శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, కె.పరిమళ్ కుమార్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, నాయకులు రఘునందన్‌రెడ్డి, దిలీప్ యాదవ్, అనిల్‌కుమార్, సందీప్, సుధీర్, అనుపమ తదితరులున్నారు.

### పాస్‌పోర్టు కార్యాలయం సందర్శన

**రాంగోపాల్‌పేట్:** సికింద్రాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాన్ని జీ–20, మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టెర్నల్ ఎఫైర్స్, సంయుక్త కార్యదర్శి ఆశిష్ కుమార్ సిన్హా సోమవారం సందర్శించారు. సికింద్రాబాద్ కార్యాలయానికి వచ్చిన ఆయన పాస్‌పోర్టు కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా పాస్‌పోర్టు అధికారులు, సిబ్బంది తయారు చేసిన జీ–20 లోగోను ఆయన సందర్శించారు.

